అక్రమ లే అవుట్లపై చర్యలేవీ...?

సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - తెర్లాం: చెరువు గర్భాలలో అక్రమంగా లే అవుట్లు వేసి అమ్మేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. మండలంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం భూములు, డి.పట్టా భూములు, రియల్ ఎస్టేట్ భూ రికార్డులు తారుమారు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చెరువు గర్భాలలో కంకర మట్టి త్రవ్వి ఇతర ప్రదేశాలకు తీసుకెళ్తున్నా, అక్రమంగా తరలిస్తున్నా గ్రామ, మండల రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించడం లాంటి అక్రమాలకు పాల్పడితే సీపీఐ చూస్తూ ఊరుకోదని, పెద్ద ఎత్తున పోరాటాలు చేసి పేదలకు భూములు దక్కేటట్లు ప్రణాళికలు ఉంటాయని అన్నారు. భూములు పెత్తందారుల చేతుల్లోకి వెళ్లి పోతున్నాయని అన్నారు.

వందలాది డి.పట్టా భూముల రికార్డులు తారుమారు చేయడం తగదన్నారు. ఎక్కడికక్కడే నిరంతరం చెరువుల్లో కంకర మట్టి త్రవ్వి తరలిస్తుంటే అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగభూషన్ పాల్గొన్నారు.

పలు వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలో వివిధ డివిజన్లలో 64 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. నగరంలో పూర్తైన అభివృద్ధి పనుల ప్రారంభ వారోత్సవాలలో భాగంగా గురువారం 5వ డివిజన్ బాబా మెట్టలో దేవి పార్క్ ప్రాంతంలో 44 డివిజన్ అయ్యన్నపేట ప్రాంతంలో, 45వ డివిజన్లోనూ, 49వ డివిజన్ గాజులరేగ ప్రాంతం కొండపల్లి వారి తోట, రాళ్లమాలపల్లి ప్రాంతాలలో అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జ్ తమ్ము, కార్పొరేటర్ తాళ్ళపూడి సంతోషికుమారి మాట్లాడుతూ నగరంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి వాటిని ప్రారంభోత్సవాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నగర సుందరీ కరణే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. నిర్లక్ష్యానికి గురైన నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న ఆయన ఆశయానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇంఛార్జిలు కోలగట్ల కృష్ణారావు,దూబే, బొద్దాన అప్పారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు శైలాడ ఈశ్వరమ్మ, గాధం మురళి, వైసిపి నాయకులు కేవీపీ రాజు,సైలాడ సత్యనారాయణ, తాళ్లపూడి పండు, లెంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : గ్రామాల్లోని ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమం కొనసాగాలి..జగనన్న పాలనే కావాలి, మా నమ్మకం నువ్వే జగనన్న అని ప్రజలు నినదిస్తున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వెల్లడించారు. ఎస్.కోట మండలం కిల్తంపాలెం గ్రామ పంచాయితీ కొత్తపాలెం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్' అనే ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘురాజు గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భముగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు జగన్ పాలన కోరుకుంటున్నారని, గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలు గ్రహించి మాకు జగన్ పాలన కావాలని ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, మాజీ ఎం.పి.పి ఒంటి అప్పారావు, సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ రాము, వార్డు సభ్యులు ఎడ్ల అర్జున, ఎడ్ల నాయుడు, సచివాలయ కన్వీనర్ ఇందుకూరి శివప్రసాద్ వర్మ, నాయకులు సుంకరి బుల్లి, గృహసారథులు సుంకరి వెంకట రామసత్యం, బంగారు రమణమ్మ, గుగ్గి రాము పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

విశాలాంధ్ర - రామభద్రపురం: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సురేంద్ర నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్లో ఉన్న చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు. అలాగే వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. నిషేధిత వస్తువులు వాహనాలలో తరలించినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో చెక్పోస్ట్ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మికి వీసీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: ఇటీవల నూతన కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి సెల్వరాజ్కు సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం గురించి కొద్దిసేపు ముచ్చటించారు.

కల్వర్టు, రోడ్డు, కాలువ నిర్మాణాలకు భూమి పూజ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని కన్నేంగెడ్డపై కల్వర్ట్, కాపువీధి గురునాధరావు ఇంటి సమీపం నుండి సీసీ రోడ్డు, కాలువ నిర్మాణాలకు సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఉప సర్పంచ్, వైఎస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, ఈఓ పాత్రో తదితరులు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ వార్డు సభ్యులు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇటీవల చేసిన తీర్మానం మేరకు పట్టణ పరిధిలోని వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పుణ్యగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీలు సూరిఅప్పారావు, వాకాడ సింహాచలం, రమణ, వార్డ్ సభ్యులు యలమంచిలి అప్పారావు, చింతల నారాయణమూర్తి, మజ్జి శేఖర్, కోటాన ఈశ్వరి, కోసూరి భారతి, నాయకులు సత్యం, ప్రసాద్, ఈఓ పాత్రో, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.రమేష్ పాల్గొన్నారు.

గడ్డి వాము అగ్నికి ఆహుతి

విశాలాంధ్ర - భోగాపురం: భోగాపురం మధుర గ్రామమైన అప్పన్నపేట గ్రామంలో గురువారం 4 ఎకరాల గడ్డి వాము అగ్నికి ఆహుతైంది. అప్పన్నపేట గ్రామానికి చెందిన పెంటుమని సూరికి చెందిన గడ్డి వాము నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా మంటలను అదుపులోకి తెచ్చినా చాలావరకు దాదాపుగా గడ్డి కాలిపోయింది. బాధితుడు సూరి బాధపడుతూ పశువులకు సంవత్సరానికి సరిపడా గడ్డిని సమకూర్చుకున్నానని అది కాస్త కాలిపోయిందని ఆవేదన చెందాడు. కొమ్మూరు సుభూషణరావు, ఇమ్మిడిశెట్టి గిరిబాబు, పేంటుమని గౌరీశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని అధికారులకు సమాచారం అందించారు. వి ఆర్ ఓ రామునాయుడు సంఘటన స్థలానికి వచ్చి నష్టాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు అధికారులకు పంపిస్తామని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - డెంకాడ: విజయనగరం పార్లమెంట్ పరిధిలో గల నెల్లిమర్ల నియోజవర్గం, డెంకాడ మండలం పేడాడ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ గురువారం చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విగ్రహాదాత సరగడ రమేష్ కుమార్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గోక త్రినాథ్, భోగాపురం మండల అధ్యక్షులు వాకాడ లక్ష్మణరావు, పూసపాటి మండల అధ్యక్షులు డి.గురవులు, డెంకాడ మండల అధ్యక్షులు తెలుగు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ అపురూపం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఎండల వేడి తాళలేక మనుషులే విలవిలలాడే సమయంలో జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతల దాటికి ఓ పిల్లి తన తల్లి వడిలో పాలు తాగుతూ సూర్య ప్రతాపం నుంచి సేద తీర్చుకుంటున్న ఓ తల్లి పిల్ల అపురూప ప్రేమ దృశ్యం గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో కనబడింది.

ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రభుత్వ శాఖల మధ్య ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అత్యుత్తమ సమన్వయం వుండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా పలు శాఖలు కలసి సమన్వయంతో సమిష్టిగా ఒక జట్టుగా పనిచేస్తేనే విజయవంతం అవుతాయని, ఆశించిన ఫలితాలు సాధించగలమన్నారు. అందు వల్ల ఆయా శాఖల జిల్లా అధికారులు తమ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేసి కార్యక్రమాలు అమలు చేసేలా బాధ్యత వహించాల్సి వుంటుందన్నారు. జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గురువారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో పరిపాలన పరమైన అంశాల్లో ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతి రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీతంలో "జై భీమ్" జయంతి వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక వేత్త, రాజకీయ నేత, సంఘసంస్కర్త, అంటరానితనం, కుల నిర్మూలనకై పోరాడిన వీరుడు, రాజ్యాంగ శిల్పి అయిన డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ జయంతి నిర్వహిం చారు. కళాశాల గ్రంధాలయ అధికారిణి డాక్టర్ లెంక సత్యవతి మాట్లాడుతూ డాక్టర్.బి. ఆర్. అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నవ సమాజ, సమ సమాజ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేయాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తది తర సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ ఎన్నో ఇబ్బందులను, వివక్షతను, పేదరికాన్ని ఎదుర్కొంటూనే దేశ విదేశాలలో అత్యున్నత విద్యను అభ్యసించి, డాక్టరేట్ పట్టానం దుకొని, భారత రాజ్యాంగాన్ని ప్రగతి పట్టాలెక్కించిన డాక్టర్ భీమ్ రావ్ చిరస్మరణీయుడు అన్నారు. పలువురు విద్యార్థులు ఎస్.హేమలత, జె.వి.కె.హిమశ్వేత, బి.నందిని డాక్టర్ భీమ్ రావ్ జీవిత ఘట్టాలను ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్. మజ్జి శశి భూషణ్రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇంతటి స్ఫూర్తి గల సభను ఏర్పాటు చేసినందుకు గాను సిబ్బందిని అభినందిస్తూ కళాశాల అధినేత బొత్స సత్యనారా యణ, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ సందేశాలు పంపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : మండలం కొండదేవు పల్లి గ్రామంలో తాగునీటి కష్టాలు పరిష్కారం చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు మరిశర్ల రామారావు ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు పంచాయతీరాజ్ అధికారులు తక్షణమే గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కారం చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజులకు ఒకసారి నాలుగు రోజులకు ఒకసారి చాలీచాలని నీరు వస్తుందని, కొండదేవపల్లి కాలనీలో త్రాగునీటిపైన తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, కొన్ని వీధులలో త్రాగునీరు వృధాగా పోతుందని కొన్ని వీధులకు నీరు రావడంలేదని దీంతో త్రాగునీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత అధికారులకు తెలియజేసిన సమస్య పరిష్కరించడం లేదన్నారు. అనంతరం త్రాగునీటి సమస్యల పైన బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు రామారావు ఆధ్వర్యంలో మహిళలు మండల అభివృద్ధి అధికారి భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖ సిబ్బందిని గ్రామాలకు పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి

విశాలాంధ్ర-పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం కొండాపురం గ్రామంలో రైతు సంఘం సమావేశం కిమిడి రామ్మూర్తినాయుడు అధ్యక్షతన జరిగింది. 17 మందితో ఆ గ్రామ నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా బలగ దుర్గారావు (గ్రామ మాజీ సర్పంచ్), కార్యదర్శిగా మజ్జి సన్యాసినాయుడు, ఉపాధ్యక్షులుగా బచ్చల పారినాయుడు, సహాయ కార్యదర్శిగా చిన్నాన్న మురళి, కోశాధికారిగా కిమిడి త్రిపురాంతక రావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ పాలకులు వ్యవసాయాన్ని నట్టేట ముంచే విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో రైతులను చైతన్య తీసుకురావడానికి పని చేయాలని పిలుపునిచ్చారు. మే 8, 9 తేదీల్లో పార్వతీపురం పట్టణంలో జరిగే పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ మహాసభలకు గ్రామం నుంచి రైతులు పెద్ద ఎత్తున కదలి వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బచ్చుల రామ్మూర్తి, లంక మోహన్ రావు, బలగల లక్ష్మం నాయుడు, పిట్ట రమణ, నెల్లి స్వామి నాయుడు, గొర్ల అప్పలనాయుడు, కల్లేపల్లి నరసింహులు, భూముల రమణ, బలగ సాంబ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై దృష్టిసారించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదుకు వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. తక్కువసమయంలో ఎక్కువ దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉంటాయని, ఆ సమయంలో మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ అంశం పరిశీలించాలన్నారు. 18 - 19 సంవత్సరాల యువతను ఓటర్లుగా నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జనాభా ఓటర్ల నిష్పత్తి, జెండర్ నిష్పత్తిని గమనించాలని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు ఉంటే గుర్తించాలని సూచించారు. 18-19 సంవత్సరాల వయస్సు గల ప్రతిపాదిత ఓటరు జాబితా, నిరాశ్రయులు, ట్రాన్స్ జెండర్లు, ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ జాబితాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించి చర్యలు చేపట్టామని అన్నారు. ఓటర్ల తొలగింపును ఎన్నికల సంఘం సూచనల మేరకు చేపడుతున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు నియామకం

విశాలాంధ్ర - సాలూరు రూరల్: సుదీర్ఘకాలంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న డిఎస్సీ 98 అభ్యర్థుల కల నెరవేరింది. రాష్ట్ర ప్రభుత్వం మినిమం టైం స్కేలు ప్రాతిపదికన జీతభత్యాలు చెల్లింపులతో వారికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించింది. అందులో భాగంగా సాలూరు మండలానికి 28 మంది అభ్యర్థులు ఎస్జీటీలుగా నియామకం చెందారు. వీరందరకి ఎంఈఓ రాజ్కుమార్ నియామక పత్రాలను అందజేశారు. ముందుగా ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పనిచేయడానికి అంగీకరిస్తున్నామని అభ్యర్థుల వద్ద నుండి ఒక హామీ పత్రాన్ని పొందారు. ఆ తరువాత రామా కాలనీ లో ఉన్న ఎంఆర్సీ భవనం వద్ద గురువారం ఉద్యోగ నియామకాలు పొందిన వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండలానికి కేటాయించిన 28 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా విధులలో చేరడం ఆనందంగా ఉందన్నారు. నూతనంగా ఉపాధ్యాయ నియామకం పొందిన వారంతా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎంను కలసిన ఎస్పీ

విశాలాంధ్ర - సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్ గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్న దొరను మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం ఉదయం ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయానికి విచ్చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ డిప్యూటీ సిఎం రాజన్న దొరని కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ మరియు ఇతర అంశాలపై చర్చించారు.

అంటిపేట సర్పంచ్ రాజీనామా

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ సిరికి మహేష్ పంచాయతీ సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తూ గురువారం జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణకు, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్కు, మండల పంచాయతీ విస్తరణ అధికారి కెకెకె వర్మలకు రాజీనామా లేఖలను అందజేసారు. సిరికి మహేష్ 1998 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక కావడం వల్ల తన సర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. తనకు రాజకీయాలలో అన్నివిధాలుగా సహకారాన్ని అందించిన ఎమ్మెల్యే జోగారావుకు, మండల నేతలకు, మండల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరి యాత్ర

విశాలాంధ్ర - బెలగాం: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ, సిపిఎంల ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ వరకు ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం సిపిఐ కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సమావేశంలో వేణు మాట్లా డుతూ మోడి నిరంకుశ చర్యలను ఖండించాలని, ప్రచార బేరి యాత్రలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, జిల్లా నాయకులు గోపి నాయుడు, మౌనా మాట్లాడుతూ రాష్ట్రానికి నష్టం చేసే చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఏప్రిల్ 14న జిల్లా కేంద్రంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రి దగ్గర, అన్ని మండలాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభించి 30 వరకు పాదయాత్రలు, సభలు సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి



విశాలాంధ్ర - మక్కువ: మండలంలో సాలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గుమ్మడి సంధ్యారాణి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు. సాలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని, తనను గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డి శిర్లం పంచాయతీలో దాకేటి గౌరు నాయుడు నాయకత్వంలో సంక్షేమ పనులు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు, దబ్బగడ్డ మాజీ ఎంపీటీసీ మింది సింహాచలం, మార్కొండపుట్టి మాజీ ఎంపిటిసి బొంగు వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి

విశాలాంధ్ర - సీతంపేట: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనకుమారి అన్నారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాడు నేడు పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు తెలియజేశారు. నాడు నేడు పనులకు సిమెంట్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, ఏకలవ్య మోడల్ పాఠశాలలు త్వరగా నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి ప్రారంభించాలని తెలియజేశారు. వేసవిలో త్రాగునీటి సమస్య రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ జి.మురళి, జీసిసి డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, డీఈ కృష్ణకుమార్, ఏపీఓ రోషి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

చినబొండపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : మండలంలోని చినబొండపల్లి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో 7వ రోజున జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథలు, వైసీపీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని శ్రీ వారికి వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వైయస్ జగన్ 4ఏళ్ల పాలనలో చేకూరిన లబ్ధి, ప్రజలు పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో ప్రజలు మోసపోయిన వైనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీ సిద్ధ జగన్నాథరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, సర్పంచ్ గండి శంకర్రావు, ఎంపీటీసీ సభ్యులు బంకూరు రవి కుమార్, జెసిఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, వైసీపీ సీనియర్ నాయకులు వి. గుర్రాజు, బి. సత్యన్నారాయణ మూర్తి, మిరియాల కామేష్, బి. మన్మధరావు, పోలినాయుడు, మర్రాపు వాసుదేవరావు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం రావాడ రోడ్ జంక్షన్లో వున్న కొత్తకోట నాగేశ్వరావు గొడౌన్లో అక్రమంగా నిల్వ ఉంచిన (26 బస్తాలు) 1540 కేజీల పి.డి.ఎస్. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ బి.సింహాచలం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శ్రీకాకుళం యూనిట్ ఎస్పీ సురేష్ బాబు ఆదేశాల మేరకు ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించటం జరిగిందని వీటి విలువ సుమారు రూ.58520 ఉంటుందని తెలిపారు. బియ్యంను రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎల్వీ ప్రసాద్కు అప్పగించి ఎం.ఎల్.ఎస్. పాయింట్కు తరిలించినట్లు తెలిపారు. విజిలెన్స్ కానిస్టేబుల్ జి.పురుషోత్తం, వీఆర్వో మెరకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఓని కలిసిన ఎమ్మెల్సీ విక్రాంత్

విశాలాంధ్ర - సీతంపేట: నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఐటిడిఎ పిఓ కల్పనా కుమారిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకొండ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఐటీడీఏ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గిరిజన అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు త్రాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలియజేశారు.

వీఆర్ఏల ఉద్యమ కార్యాచరణ విడుదల

విశాలాంధ్ర - కురుపాం: గ్రామ రెవిన్యూ సహాయకుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 14వ తేదీన డా. బి.ఆర్.అంబేద్కర్ పుట్టినరోజు పురస్కరించుకొని విగ్రహాలకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్ఏల అధ్యక్షులు జి.ఈశ్వరరావు తెలిపారు. అలాగే నియోజక వర్గాలు వారీగా ఎం.ఎల్.ఏ.తో రాయబారాలు, మే నెల లో విజయవాడ లో రిలే నిరాహార దీక్షలు, ఫేస్ యాప్ హాజరు మినహాయింపు, 104 జి.ఓ.ను రద్దు చేసి. పాత పద్ధతి లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ హెల్పింగ్ హాండ్స్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - బెలగాం : స్థానిక రాయగడ రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదైన మండల శ్రీధర్, సత్యవతిల బడ్డీ దుకాణం పూర్తిగా దగ్ధం కావడంతో పోస్టల్ హెల్పింగ్ హాండ్స్ గురువారం ఆర్థిక సాయాన్ని అందించింది. పదివేల రూపాయల నగదును తమ వంతు సాయంగా పార్వతీపురం తపాలా శాఖ సహాయ సూపరిండెంట్ సూరకత్తుల శ్రీకర్ బాబు, సిబ్బంది చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

పంచాయతీ నిధులతో బోరుబావి ఏర్పాటు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో పంచాయతీ నిధులతో బోరుబావి తవ్వించారు. గ్రామంలోని గుడిసె వారి కల్లాల వద్ద రైతుల సౌకర్యార్థం ఈ బోరుబావి ఏర్పాటు చేసినట్టు రైతులు తెలిపారు. ఇప్పటివరకు నీటి కోసం ఎన్నో కష్టాలు పడ్డామని సర్పంచ్ లక్ష్మి చొరవతో నీటి కష్టాలు తీరాయన్నారు. కార్యక్రమంలో రైతులు గండి పడాల వెంకటరమణ, రమణ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి: డీఐఓ

విశాలాంధ్ర - గరుగుబిల్లి/బెలగాం: విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపి, రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ప్రతి తరగతిలో ఉండే పాఠ్యాంశాల మాదిరిగా ఆరోగ్య విద్య పట్ల ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని అన్నారు. హిమోగ్లోబిన్ 8 శాతం కంటే తక్కువగా ఉంటే తీవ్రమైన రక్తహీనతగా పరిగణిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య సిబ్బందిచే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జె.అన్నపూర్ణ (ఇం చార్జి), ఎం.జానకి, సూపర్‌వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం మాలతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ కృషితో సమాన అవకాశాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఫలితంగా సమాజంలో అందరికీ సమాన అవకాశాలు లభించాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు అన్నారు. ఎస్.కోటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల సభలో కేశవరావు మాట్లాడారు. అంబేద్కర్ చేసిన కృషి భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన స్థాయి, రిజర్వేషన్ రూపకల్పన గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్ కుమార్, కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు బి.సంధ్యారాణి, కళాశాల అధ్యాపకులు వాసుదేవరావు, వలీ ఖాన్, ఈరన్న, భాస్కర్, శ్రీలక్ష్మి, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: కొమరాడ మండలంలో గురువారం ఇన్చార్జ్ ఎంపీడీవో ఎల్వి అప్పారావు గుమ్మడ, గంగిరేవలస, గుణానపురం గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో ఎల్వి అప్పారావు మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో ఉద్యోగస్తులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, లేదంటే ఎంతటి వారిపై అయినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి కొళాయి పనులు 70 శాతం పూర్తి

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చినగుడిపాల పంచాయతీ శివారు బాజంకివాని పాలెం గ్రామంలో ఇంటింటి కొళాయిల పనులు 70శాతం మేర పూర్తి కాగా ఇంకా 30శాతం పనులు పూర్తి కావలసిన ఉండగా గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఈఈ కెఆర్‌వి పైడిరాజు, జేఈ దేవి తదితరులు పూర్తి చేసిన కొళాయి పనులను పరిశీలించారు. 12 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్ 70శాతం మేర పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ కామేష్, వాలంటీర్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

షిరిడీసాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర - వంగర: మండల కేంద్రం వంగరలో షిర్డీసాయి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త బొత్స వెంకట నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం సాయంకాలం 6 గంటల నుండి, శుక్రవారం ఉదయం 6 గంటల వరకూ సాయినామ సంకీర్తన కార్యక్రమాన్ని చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ ఆరవెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని గజపతినగరం ఎంపీడీవో వప్పు సుదర్శనం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పనిచేసే చోట టెంట్లు వేయడంతో పాటు మంచినీటి సదుపాయం కల్పించాలని, అలాగే ఫస్ట్ ఎయిడ్ బాక్సులు పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో సిహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: గత కొన్నేళ్లుగా పట్టణంలోని శ్రీనివాస కాలనీలో పెట్రోల్ దొంగల ఆగడాలు మితిమీరుతున్నాయి. మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ కొందరు యువకులు రాత్రి వేళలో ఇంటిముందు ఉంచిన ద్విచక్ర వాహనాలలో పెట్రోలు దొంగలించి విక్రయించగా వచ్చిన డబ్బులతో మత్తు పానీయాలు సేవించి వీధుల్లో హల్‌చల్ చేస్తున్నారు. రాత్రివేళ వీధుల్లో పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసుల జాడ కానరాకపోవడంతో వీరి ఆగడాలు మరింత పెరిగాయి. కొన్ని సందర్భాలలో రాత్రివేళ వీధిలైట్ల సరఫరాను ఆపిమరి దుండగులు ఈ దుశ్చర్యలకు పాల్పడు తుండడం గమనార్హం. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి రాత్రి వేళల్లో శ్రీనివాస కాలనీలో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పురిటిపెంటలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామంలో చెందిన దాసరి సన్ని తాతకు చెందిన పశువులశాలతో పాటు కళ్ళల్లో గల ధాన్యం పూరి కాలిపోయింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే గజపతినగరం అగ్నిమాపక కేంద్రం అధికారి తమ సిబ్బందితో సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అంచనా వేశారు. ప్రమాదం తెలిసిన వెంటనే ఆ గ్రామ వైసిపి నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ బాధితులను పరామర్శించారు.

రాయితీపై మత్స్య యూనిట్లు మంజూరు



విశాలాంధ్ర - పార్వతీపురం: రాయితీపై మత్స్య యూనిట్లు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. రాయితీపై మత్స్య యూనిట్లు ఏర్పాటుపై స్థానిక జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో గురువారంనాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మాట్లా డుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద ఎస్సీ ఎస్టీలమహిళలకు విలువ ఆధారిత మత్స్య యోజన యూనిట్లు 60 శాతం రాయితీపై మంజూరుకు అవకాశం ఉందన్నారు. ఇతరులకు 40 శాతం మాత్రమే రాయితీ లభిస్తుందన్నారు. ఆహారశుద్ధిసొసైటీ క్రింద అదనంగా 35 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని, మంచి ఆహారం తక్కువ ధరకు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు పలువురు జిల్లాఅధికారులు, వెలుగు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం...లబ్దిదారులకు శాపం

నిబంధనలు సడలింపు జరగక అర్హులకు అందని పథకాలు పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర - వేపాడ: ఎవరో జ్వాలను రగిలించారు వేరెవరో దానికి బలయ్యారు అన్న ఓ సినీ కవి రాసిన గేయం లాగ మారింది కొంతమంది పండుటాకుల పరిస్థితి. అధికారులు చేసిన తప్పులకు కొంతమంది బలి కాగా నిబంధనలు సడలింపు జరగక మరికొంతమంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక అన్యాయమైపోతున్నారు. నిజానికి వయసు రీత్యా పథకాలు పొందడానికి అర్హతలున్నా ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు కావడం వల్ల అనేకమంది లబ్ధి పొందలేకపోతున్నారు. మరికొంతమంది అతి చిన్న వయస్కులు అయినప్పటికీ ఆధార్ కార్డులో వయసు సరిపోవడంతో పింఛన్ వంటి అనేక పథకాలు పొందుతున్నారు. అలాగే కొంతమందికి విద్యుత్ బిల్లులు తక్కువగా వస్తున్నప్పటికి సచివాలయాల కంప్యూటర్లలో బిల్లులు ఎక్కువగా చూపడం వల్ల పథకాలకు అర్హత లేకుండా పోతుంది. అలాగే ఆదాయ పన్ను కడుతున్నారని, బ్యాంకుల్లో రుణ సౌకర్యం పొంది పన్ను కడుతున్నారని

చూపినా, భూములు తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువగా చూపడం వంటి అనేక వంకలు చూపుతున్నారు. ఎంతోమంది అభాగ్యులు వైకల్యంతో బాధపడుతుండగా వారికి చేదోడు వాదోడుగా నిలిచేవారు లేకపోవడం, సదరం ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే స్థానిక ఆస్పత్రులకు కాకుండా ఇతర జిల్లాల ఆస్పత్రులకు పంపడం వల్ల అనేక ఇబ్బందులకు గురి కావడం సాధారణ విషయంగా మారింది. అలాగే కొంతమందికి కళ్ళు బాగానే కనిపిస్తున్నప్పటికి వైద్య నిపుణులు నూరు శాతం అంధులుగా

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో వైసీపీ నేతల హస్తం ఉందనడంలో సందేహం లేదు.

మండలంలోని బానాది గ్రామానికి చెందిన దమ్ము అర్జున అనే వృద్ధుడు వయసు నిజానికి 70 ఏళ్ళు కాగా ఆధార్ కార్డులో 51 ఏళ్లుగా నమోదు చేయడం వల్ల పింఛన్ మంజూరు కాలేదు. అలాగే మండలంలోని రాయుడుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు పక్షవాతానికి గురి కాగా సదరం ధ్రువీకరణ లేక పింఛన్ మంజూరు కాక వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఆదరణ కొరవడి బిక్షాటన స్థాయికి దిగజారి పోయి అవస్థలు పడుతున్నాడు. ఇటువంటి అభాగ్యుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిబంధనలు సడలించి పథకాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేగంగా రీ సర్వే ప్రక్రియ: కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలో రీ సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను, రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ జి.సాయిప్రసాదుకు వివరించారు. గురువారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి, రాష్ట్రంలో జరుగుతున్న రీసర్వే ప్రగతిపై రాష్ట్ర భూ పరిపాలన కమిషనరు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాలు ప్రింటింగ్, హద్దురాళ్ళు పాతడం, జిసిపి మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్ (13)నోటిఫికేషన్ల ప్రగతి తదితర అంశాపై కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో మొదటి దశ రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో హద్దురాళ్ళు పాతడం, ఖాతాలకు ఫోటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

స్వధార్ కేంద్రం నుంచి ఇద్దరు పరారీ

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: పట్టణం పరిధిలో గల విటి అగ్రహారం మహిళ ప్రాంగణం స్వధార్ కేంద్రంలో తాత్కాలికంగా పునరావాసం పొందుతున్న ఒక్ మైనర్ బాలికతో పాటు ఒక మేజర్ అమ్మాయి బుధవారం రాత్రి కిటికీ ఊచలు తీసుకొని పరారైనట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. స్వధార్ కేంద్రంలో 17 ఏళ్ల ఒక మైనర్ బాలికను ఫిబ్రవరి 24 నుండి జిల్లా బాలల సంక్షేమ సమితి ఆదేశాలు మేరకు తాత్కాలిక పునరావాసంలో ఉందని, గత రెండు వారాలు కిందటి 19 ఏళ్ల ఒక మేజర్ అమ్మాయికి స్వధార్ కేంద్రంలో ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. వీరిద్దరూ ఒకే గదిలో ఉంటూ బుధవారం రాత్రి పరారైనట్లు తెలిపారు. స్వధార్ సిబ్బంది, పోలీసులు గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో విజయనగరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ జి.హిమబిందు, సభ్యులు సుధారాణి పట్నాయక్, భవాని, మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శాంతి కుమారి, సిబ్బంది యాళ్ళ నాగరాజు పాల్గొన్నారు.

వాత్సల్య సర్టిఫికెట్లకు సచివాలయాల్లో ముప్పతిప్పలు

విశాలాంధ్ర - బెలగాం : మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన దరఖాస్తుదారులకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి వద్దకే అందజేయాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా జనసేన పార్టీ నాయకులు గొర్లి చంటి, వంగల దాలి నాయుడు, రాజాన రాంబాబు, బంటు శిరీష్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మిషన్ వాత్సల్య పథకాన్ని ఐసిడిఎస్ అధికారులు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రకటన చేశారని, వాత్సల్య పథకానికి అవసరమైన సర్టిఫికెట్ల కోసం సచివాలయానికి వెళితే ముప్పతిప్పలు పెడుతున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ల జారీలో కీలక పాత్రధారులైన విఆర్వోలు దొరకడం గగనమవుతుందన్నారు. ఈ విషయంలో సచివాలయాల వలన ప్రయోజనం లేదని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారన్నారు. కాబట్టి తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మిషన్ వాత్సల్య దరఖాస్తుదారులకు వాలంటీర్ల ద్వారా అవసరమైన సర్టిఫికెట్లు ఇంటి వద్దకే అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ అజెండా

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలో అడుగడుగునా వెనుకబాటు తనం కనిపిస్తుందని, ఈ ప్రభుత్వ పాలనలో మాటలు కోటలు దాటడమే తప్ప చేతల్లో కనిపించడం లేదని టీడీపీ రాష్ట్ర నాయకులు పూసపాటి అశోక్ గజపతిరాజు, కిమిడి కళా వెంకట్రావు, ప్రతిభా భారతి అన్నారు. టిడిపి పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అధ్యక్షతన గురువారం అశోక్ బంగ్లాలో విజయనగరం పార్లమెంటరీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికా రంలోకి వచ్చాక పచ్చని కొండలను బోడి కొండలుగా మారుస్తు న్నారని విమర్శించారు. చరిత్రలో గొప్పగా చెప్పుకునే అమరావతి రాజధానిని మూడు రాజధానుల పేరుతో అపహాస్యం పాలు చేశారని ఎద్దేవా చేశారు. తోటపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు చేయలేదని మండిపడ్డారు. భోగాపురం, గోవాలో గల మోప ఎయిర్పోర్టుల నిర్మాణానికి జిఎంఆర్ సంస్థ చేపట్టగా గోవా ఎయిర్పోర్టును జిఎంఆర్ సంస్థ పూర్తి చేయగా భోగాపురం ఎయిర్పోర్ట్‌ను ఇప్పటివరకు శంకుస్థాపన చేయలేదంటే ఈ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తెంటు జయప్రకాష్, బేబీ నాయన, కొండ్రు మురళి, ఐవిపి రాజు, కరణం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతంలో గ్రామరథాన్ కార్యశాల సర్టిఫికేట్ ప్రదానోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు గ్రామ రథాన్ పేరుతో నిర్వహించబడిన ఆంగ్ల కార్యశాలలో భాగంగా విద్యార్థులకు సర్టిఫికేట్ ప్రదానం కార్యక్రమం గురు వారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధు లుగా కెనడా కు చెందిన హుయిజాంగ్ యాంగ్, శివ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హుయిజాంగ్ యాంగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే భాష ఆంగ్లం. అందువలన ఆంగ్లంలో మంచి పరిజ్ఞానం మనకు కొత్త దేశాలకు వెళ్లేందుకు మార్గ నిర్దేశం చేస్తుందని, అలాగే భాష దేశాల మధ్య అంతరాన్ని దూరం చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు జరిగిన వర్క్‌షాప్ క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఆంగ్ల భాషను బాగా అవలోకనం చేసుకోవడం వలన విద్యా ర్థులు వారి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారు అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి రామమూర్తి, డీన్ ఆర్‌డి డాక్టర్ నరేంద్ర కుమార్, ఆంగ్ల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: బీసీల ఆరాధ్య దైవం బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ వర్ధంతిని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయనగరంలో ఉన్న శ్రీ రాధాకృష్ణ జిల్లా యాదవ కళ్యాణ్ మండపంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం నాయకులు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ముద్దాడ మధు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చినా బీసీ రిజర్వేషన్లు తీసుకువచ్చిన ఘనత బీసీ మండల్‌కి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొ రేషన్ డైరెక్టర్లు అవనాపు లక్ష్మణరావు, రౌతు భాస్కర్ రెడ్డి, గొంప అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నమ్మి ప్రసాద్, బీసీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మైదాన సతీష్, కోట్ల పైడిరాజు, జిగులు జనార్ధన్, గండబోయిన శేఖర్ పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికను రూపొందించండి

లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి కాండ్రేగుల

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జిల్లాలో గురువారం నుంచి జరగబోయే గ్రామ సభలలో గ్రామాలలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలతో చర్చించి వాటిపై వార్షిక ప్రణాళికను రూపొందించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ కోరారు. ఎస్.కోటలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023- 24 ఆర్థిక సంవత్సరం మొదటి గ్రామ సభ కావడంతో అధికారులు దీనికి ప్రాధాన్యత కల్పించాలని, సచివాలయ సిబ్బందితో కాకుండా మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల అవసరాలను, సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.నాగేశ్వరరావు, కె.రామలక్ష్మి, మోహన్ పాల్గొన్నారు.

కొత్త పోలమ్మ తల్లి పండుగ ఏర్పాట్లకు సిద్ధంకండి

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలోని మల్లంపేట శ్రీశ్రీశ్రీ కొత్త పోలమ్మ తల్లి అమ్మవారి పండగ సందర్భంగా మల్లంపేట గ్రామంలో మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సావు మాట్లాడుతూ కొత్త పోలమ్మ తల్లి పండగ సందర్భంగా డ్రైనేజీలలో పూడిక తీయాలని, రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్స్ ఇంటి గోవింద, తెంటు పార్వతి, కొర్లపూ రామారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ విరమించుకోవాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణం జెండా మాల్ సెంటర్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ప్రజా సంఘాల నాయకులు, జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మణ నాయుడు, కాంగ్రెస్ పార్టీ పిసిసి మెంబర్ బొబ్బిలి పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని 1982లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 33 వేల ఎకరాలలో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మించి లక్షలాదిమంది కార్మికులకు ఉద్యోగ ఉపాధిని కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

గుచ్చిమిలో భూసార పరీక్షలు నిర్వహణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని గుచ్చిమి గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎస్ అవినాష్ ఆధ్వర్యంలో గురువారం భూసార పరీక్షలు నిర్వహణ, భూసార పరీక్షల కొరకు మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలన్న దానిపై విఏఏలకు, రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలు అత్యంత ముఖ్యమైనవని, భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగుచేస్తేనే రైతులు మంచి పంట, దిగుబడులు సాధిస్తారని తెలిపారు. చౌడు భూములు వంటి ప్రదేశాలలో మట్టి నమూనా తీసినప్పుడు వాటిని వేరుగా సేకరించాలని తెలియజేశారు. పొలం అంతా ఒకేవిధంగా ఉన్న యెడల మట్టి నమూనాను ప్రతీ ఐదు ఎకరాలకు ఒక నమూనా తీసుకోవాలని, ఏదైనా ఒక ఎకర పొలంలో 10లేదా 12చోట్ల నమూనాను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రాపు ధనం, ఎంపీటీసీ జగదీశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది పనితీరుపై పీడీ అసంతృప్తి

విశాలాంధ్ర - గరుగుబిల్లి: మండల ఉపాధి హామీ పథకం సిబ్బంది పనితీరుపై పార్వతీపురం మన్యం జిల్లా డుమా ప్రాజెక్టు డైరెక్టర్ డి.రామచంద్రరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మండల ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని తనిఖీ చేసిన సమయంలో పలువురు సిబ్బంది ఎటువంటి అనుమతిలేకుండా గైర్హాజరు కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా చేపడుతున్న సమయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరిద్దరు ఉద్యోగులు సెలవు పెట్టినట్లు స్థానిక అధికారులకు తెలియజేసినప్పటికీ ఆ సిబ్బందికి సంబంధించి ఆఫీసు రిజిస్టర్లో సెలవు దరఖాస్తు లేకపోవడం గుర్తించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

ముగిసిన చమ్మర్స్ 2023

నేషనల్ టెక్నికల్ స్టూడెంట్ సింపోజియం

విశాలాంధ్ర - డెంకాడ: చమ్మర్స్ 2023 నేషనల్ టెక్నికల్ స్టూడెంట్ సింపోజియం గురువారం ఘనంగా ముగిసింది. విజయనగరం ఎం వి జి ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఏ)లోని

డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ నిర్వహించిన రెండు రోజుల చమ్మర్స్ 2023 నేషనల్ టెక్నికల్ స్టూడెంట్ సింపోజియం భారీ విజయంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకకు బి. రవి కుమార్, భారత ప్రభుత్వంలోని ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్‌ను ముఖ్య అతిథిగా, చైతన్య వర్మ, సీఈఓ, శ్రీవేద కన్సల్టెన్సీ, రాము నాయుడు, సహ భాగస్వామి, శ్రీవేద కన్సల్టెన్సీ గౌరవ అతిథులుగా ఆహ్వానించబడ్డారు. బి. రవి కుమార్ మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కి అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్. వై.ఎం.సి. శేఖర్, కన్వీనర్ ప్రొఫ్. బి.సర్వారావు పాల్గొన్నారు.

నూతన విగ్రహాలతో శోభాయమానంగా విజయనగరం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరం కొత్త అందాలను సొంతం చేసుకుంటుంది. నూతన విగ్రహాలతో విద్యుత్ దగదగలతో కాంతి లీనమవుతోంది. ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో కార్పొరేట్ హంగులు అద్దుకుంటుంది. అభివృద్ధి చెందిన నగరాలతో పోటీపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పనే కాకుండా ప్రధాన జంక్షన్ల అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. గతానికి భిన్నంగా ఎటు చూసినా కొత్త అందాలతో నగరం శోభాయమానంగా శోభల్లుతోంది. ఈ మధ్యనే స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించే ఉప్పు సత్యాగ్రహం దండి మార్చ్ విగ్రహవిష్కరణ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా గావించబడింది. నేడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని బాలాజీ జంక్షన్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాలు ఏర్పాటే కాకుండా వాటి చుట్టూ ఫౌంటెన్లను అమర్చుతూ కొత్త అందాలను సంతరింపజేస్తున్నారు. పురపాలక సంఘం నుండి నగరపాలక సంస్థగా రూపాంతరం చెందిన తర్వాత నగర స్వరూపం పూర్తిగా మారిపోతుంది. కార్పొరేషన్ కు దీటుగా అభివృద్ధి చెందుతూ చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. 13.05 లక్షల రూపాయలతో బాలాజీ జంక్షన్లో ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ లాంఛనంగా ప్రారంభించనున్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొని విగ్రహవిష్కరణలో పాల్గొనున్నారు. ఇక్కడ కూడా విగ్రహం చుట్టూ ఫౌంటెన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసారు. ప్రజలను ఆకర్షించే విధంగా వివిధ రకాల చేపల అక్వేరియం ఏర్పాటు చేశారు.

అలాగే మన విజయనగరం పేరిట జలపాతాన్ని తలపించే విధంగా వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఫోర్ట్ సిటీ స్కూల్ జంక్షన్ వద్ద ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థూపాన్ని ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రానున్న రోజుల్లో నగరం మరిన్ని అందాలతో మెరిసిపోతూ చూపరులను మరింత కట్టిపడేసే విధంగా మారగలదని ఆశిద్దాం.

చెత్తసంపద కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అంటిపేట, కాశాపేట గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను మండల పంచాయతీ విస్తరణ అధికారి కెకెకె వర్మ గురువారం పరిశీలించారు. కేంద్రాల నిర్వహణ గూర్చి అడిగి తెలుసుకున్నారు. పొడిచెత్త, తడి చెత్త కేంద్రాలను వేర్వేరుగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శశిభూషణ్, మురళి, హరితరాయబారులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - సీతంపేట: దోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమల్ కమల్ తనిఖీ చేశారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని, పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సుబ్బారావు, రాము మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తుల అరెస్టు

విశాలాంధ్ర - పార్వతీపురం: ఐరన్ సెంట్రింగ్ సీడ్స్ దొంగతనం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసామని కొమరాడ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. నాయుడువలస, జి ఎం వలస మండలం బిత్తరపాడు గ్రామాలకు చెందిన బోన్ జగదీష్, సామల కిరణ్ స్వామిలను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని తెలిపారు.

నేడు అంబేద్కర్ జయంతి

విశాలాంధ్ర - పార్వతీపురం: బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి (పూ.అ.భా) పి.శశిధర్ కుమార్ తెలిపారు. ఐటీడీఏ గిరి మిత్ర సమావేశ మందిరంలో జయంతి వేడుకలు, జిల్లా ఆసుపత్రి సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని చెప్పారు.

అభివృద్ధి పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: అభివృద్ధి పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయం నుండి ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో అభివృద్ధి పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి మాట్లాడారు. గడప గడపకు మనప్రభుత్వం పనులకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. త్వరగా గౌండింగ్ అయ్యేలా ఎంపీడీఓ లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. క్రాష్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తాగునీటి బోర్లు మరమత్తులు చేసి నీటి ఎద్దడి లేకుండా పనులు జరిపించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎమ్.వి.ఆర్.క్రిష్టా జీ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు పరిశీలించిన ఆర్డీఓ

విశాలాంధ్ర - సాలూరు రూరల్: మండలంలో బాగువలస గ్రామంలో రీ సర్వే పనులను రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత గురువారం పరిశీలించారు. రీ సర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో రాళ్ళు వేయాలని ఆమె ఆదేశించారు. అవసరం మేరకు ఎక్కువ మంది కూలీలను ఏర్పాటు చేసి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి తగిన సహాయాన్ని అందించాలని కోరారు. రోజుకు 60 నుండి 80 వరకు రాళ్ళు పాతుతున్నారని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామస్వామి, సర్వేయర్,విఆర్వో, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో అలరించిన థింసా నృత్యాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఇటీవల కాలంలో స్కూల్స్, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రైవేట్ కార్యక్రమాలు, శుభకార్యాలకు గిరిజన సాంప్రదాయ థింసా నృత్యాలు వేదికగా మారుతున్నాయి. అందులో భాగంగా శృంగవరపుకోట పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గురువారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కోనాపురం భారతి ట్రూప్ నిర్వహించిన గిరిజన థింసా నృత్యాలు స్థానికులను అలరించాయి. పట్టణంలోని ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన ఈ ట్రూప్ కాలనీలో కొండలరావు అనే తమ అధికారిణి వివాహానికి తీసుకెళ్లేందుకు థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. కాలనీలో సంప్రదాయ గిరిజన నృత్యాలు ప్రదర్శించడంపై చిలకలగడ్డ సన్యాసిరావు మాస్టారు, కాలనీ పెద్దలు, ప్రజలు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎయిర్ పోర్టు శంకుస్థాపన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు మే 3న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్ననేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి.ఎస్ గురువారం జిల్లా అధికారులు, ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ జి.ఎం.ఆర్. ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం తదితర అంశాలపై ఇప్పటివరకు జరిగిన ప్రగతిని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. భూసేకరణ దాదాపుగా పూర్తయ్యిందని, పునరావాసం కూడా పూర్తిచేసి కుటుంబాలను తరలించామని జె.సి. తెలిపారు. 3వ తేదీన శంకుస్థాపనకు జి.ఎం.ఆర్.సంస్థ ద్వారా చేయనున్న ఏర్పాట్లపై సంస్థ ప్రాజెక్టు హెడ్ రామరాజు వివరించారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.సూర్యకళ, భోగాపురం తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, రోడ్లు భవనాల శాఖ ఇ.ఇ. రమణ తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

విశాలాంధ్ర - పార్వతీపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరి వాడని, అన్ని వర్గాల ప్రజలకు దిశ నిర్దేశం చేసిన మహానుబావుడని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. అంబేద్కర్ 132 వ జయంతి సందర్భంగా గురువారం సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మన్యంజిల్లా నాయకులు ఎం.రత్నకుమార్, డి.చంద్రమౌళి, గంట చంద్రమౌళి, ఫరూక్, ఎన్జీవో నాయకులు శ్రీనివాసరావు, ఎస్టీ సంఘం నాయకులు రంజిత్ కుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పని హక్కును సాధిద్దాం - ఉపాధి పథకాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర - గరుగుబిల్లి/బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా : పని హక్కును సాధిద్దాం- ఉపాధి పథకాన్ని కాపాడుకుందాం అని అఖిల భారత గ్రామీణ, వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. సంఘం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చినగొడబ పంచాయతి కేంద్రంలోని ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియా ముఖంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయని ఆరోపించారు. అందులో భాగంగా పని వేళలు పెంచుతూ కూలీలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వాలు పని గంటలు కుదించి పాత విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు అందించి 200 పని దినాలు కల్పించాలని అన్నారు. వీటన్నింటిపై ఏప్రిల్ 17వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని కావున మీరంతా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రతిపక్షాలవన్నీ అబద్ధాలు: జెడ్పీ ఛైర్మన్ మజ్జి

విశాలాంధ్ర - విజయనగరం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే ఓర్వలేని ప్రతి పక్షాలు.. ప్రజలకు అవాస్తవాలు చెప్పి అబద్దాలను నిజాలుగా చెప్పి మభ్య పెట్టాలని చూస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ శంకుస్థాపన చెయ్యనున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మరో 30 నెలలో ప్రారంభోత్సవం చేయబోయేది కూడా ఆయనే అని తెలిపారు. అన్ని అనుమతులు క్లియరెన్స్‌లు పూర్తిచేసుకుని వచ్చే నెల మూడో తారీఖున భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌కు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా శంకు స్థాపన చేస్తారన్నారు. గత ప్రభుత్వంలో ఏవియేషన్ మినిస్టర్గా ఉండి అశోక్ గజపతి రాజుఎయిర్పోర్ట్ శంకుస్థాపనకి రాకపోవడానికి గల కారణాలు ఆయన ఒకసారి చెప్పాలని డిమాండ్ చేశారు. దాదాపు కోర్టులో 150 పైగా కేసులు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు అలానే ఎయిర్పోర్ట్ కు కనీసం నీటి సౌకర్యాలు మరియు భూములు కోల్పోయిన రైతులకు పునరావాసం ఏర్పాటు చేయకుండానే శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పలాస వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు కె.వి సూర్యనారాయణ రాజు (పులి రాజు), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చనుముల రమణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సమీక్షలో రాష్ట టిడ్కో ఛైర్మెన్ జమ్మాన

విశాలాంధ్ర - పార్వతీపురం: ముఖ్యమంత్రి .వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మునిసిపల్ శాఖా మాత్యులు ఆదిమూలపు సురేష్ , మునిసిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్‌లతో కలిసి నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమములో భాగముగా పి.యం.ఏ.వై - వై.ఎస్.ఆర్ జగనన్న నగర్ జిం3 గృహ నిర్మాణం పథకంలో భాగముగా రాష్ట్రములో వివిధ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు నగర పంచాయతీలలో జరుగుతున్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారన్నారు. జూన్ 2023 నాటికి పూర్తి స్థాయిలో అన్ని ప్రాంతాలలో సకల సదుపాయాలతో గృహాల అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా లక్ష్యాలను పూర్తి స్థాయిలో అధిగమించేలా సంభందిత కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారితో ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకొని నిర్మాణ పనులలో పురోగతి సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చెయ్యడం జరిగిందన్నారు. తనతో పాటు టిడ్కో రాష్ట్ర కార్యాలయ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారని చెప్పారు.

డీఎస్సీ నియామక పత్రాలు అందజేత

విశాలాంధ్ర - గరుగుబిలి: 1998 డీఎస్సీలో అర్హత సాధించిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి నగిరెడ్డి నాగభూషణరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం గరుగుబిల్లి, జియ్యమ్మ వలస మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి, ఖడ్గవలస, రావివలస, సుంకి, కారివలస, కే.ఆర్.ఎస్.వలస, శివరాంపురం, దత్తివలస, సీమల వానివలస, పెదగుడబ గ్రామాల్లోని మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి.లు బోను రామకృష్ణ, ఎడ్ల యశోద, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట :డీఎస్సీ 1998 ద్వారా క్వాలిఫై అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 12 మందికి ఎస్.కోట మండల విద్యా శాఖాధికారి పి.సత్యం నారాయణ నియామకం పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ మండలంలో గుర్తించిన ఖాళీలు ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారి వారు కౌన్సెలింగ్ జరిపి డీఎస్సీ 1998లో క్వాలిఫై అయిన 12 మంది సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులను పంపగా గురువారం నియామక పాత్రలు అందజేసి విధుల్లో చేర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు, సంతగవిరమ్మపేట ప్రధానోపాధ్యాయులు కె.బంగారు నాయుడు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలో గురువారం 1998 డీఎస్సి బి టీచర్స్‌కి నియా మక ఉత్తర్వులు అందజేయడం జరిగింది. తెర్లాం మండలం లో 18 మంది వివిధ పాఠశాలలలో గురు వారం నుండి విధులలో జాయిన్ అయ్యారని ఎంఈఓ జే.త్రినాధరావు తెలిపారు.

రేగిడి: స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఈఓ ఎం వి ప్రసాద్ రావు గురువారం 1998 డీఎస్సీలో ఎంపికైనటువంటి ఐదుగురు ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. మండలంలో అభ్యర్థులకు గాను ఐదు మంది అభ్యర్థులక్ను ఆర్డర్ అందజేశామని వెల్లడించారు. తుమ్మి వెంకటరమణ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కొండవలసకు, కొప్పర సతీష్ కుమార్ మండల పరిషత్ పాఠశాల సంకిలి కి, అప్పికొండ శ్రీనివాసరావు మండల పరిషత్ పాఠశాల సంకిలి, బొత్స గజేంద్రనాయుడు మండల పరిషత్ పాఠశాల ఉణుకూరు, చోడవరపు బాబురావు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మునకలవలసకు జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది ఎంఐఎస్ కోఆర్డినేటర్ కింబూరు శ్రీనివాసరావు, పొన్నాడ అప్పలనాయుడు, అకౌంటెంట్ కర్ర సూర్యారావు, అటెండర్ మునకాల శంకరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి, మెగా డీఎస్సీ విడుదల చేయాలనీ కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ నుంచి కన్యకపరమేశ్వరి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేశారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరీష్, రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులును భర్తీ చేయాలని. ప్రతి ఏటా ఇస్తానన్న మెగా డీఎస్సిని విడుదల చేయాలనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు ప్రతి సం వత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, అలానే ప్రతి ఏటా మెగా డీఎస్సీ ఇస్తానని హామీ ఇచ్చారుకానీ ఇప్పటివరకు ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవడమే కాక, మెగా డీఎస్సీ కూడా తీయకుండా నిరుద్యోగ జీవితాలతో ఆడుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, జిల్లా కమిటీ సభ్యులు సౌమ్య, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర - విజయ నగరం క్రైమ్: జిల్లాలో రాజాం, కొత్తవలస పోలీసు స్టేషను పరిధిలో మోటారు సైకిళ్ళ డిక్కీల నుండి నగదు చోరీకి పాల్పడిన నిందుతున్న అరెస్టు చేసి, రూ.7 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు సిసిఎస్ ఇన్స్పెక్టరు ఎం.బుచ్చిరాజు గురువారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సిసిఎస్, కొత్తవలస, రాజాం పోలీసు స్టేషను సిబ్బందితో ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి, ఈ కేసులను ఛేధించేందుకు దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజికుప్పం గ్రామానికి చెందిన కే.సుబ్రమణ్యం మరో ముగ్గురు నేరస్థులు ఈ నేరాలకు పాల్పడినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ నేరస్థులు ఒక బృందంగా ఏర్పడి రద్దీగా ఉన్న బ్యాంకుల్లో కస్టమర్లుగా వ్యవహరించి, బ్యాంకు లావాదేవీలు చేస్తున్న వ్యక్తులను గమనించి, నగదు డ్రా చేసి, మోటారు సైకిళ్ళ డిక్కీల్లో పెట్టుకున్న వ్యక్తులను వెంబడించి, ఏదైనా పని మీద వారు ఆగి, పార్కింగు చేసిన వాహనాల డిక్కీలను తెరిచి నగదు దొంగలించే వారిని పేర్కొన్నారు. కొత్తవలసలో రూ. 5లక్షలు, రాజాం రూ. 2లక్షలను ఇదే తరహాలో దొంగలించినట్లు గుర్తించి, సిసిఎస్ పోలీసు లు రికవరీ చేసి, సుబ్రమణ్యంను అరెస్టు చేసినట్లు చెప్పారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని సిసిఎస్ ఇన్స్పెక్టరు బుచ్చిరాజు తెలిపారు. ఈ కేసులో సిసిఎస్ ఎస్ఐ సాగరబాబు,హెచ్సీలు ఎం.డి. ఇమ్మాన్, దాసరి శంకరరావు, రాజాం కానిస్టేబులు శ్రీనివాసరావు, కొత్తవలస కానిస్టేబులు గౌరినాయుడు క్రియాశీలకంగా పని చేసారని, వారిని డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ అభినందించారని సిఐ బుచ్చిరాజు తెలిపారు.

మండలానికి రిపోర్టు చేసిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - సీతానగరం: 1998 డి.ఎస్సీ ద్వారా ఎంపికైన ఎనిమిది మంది ఉపాధ్యాయులు గురువారంనాడు మండల విద్యాశాఖాధికారి జి.సూరిదేముడును కలిసి జాయినింగ్ రిపోర్టు చేశారు. వారికి సంబందించి అన్ని ఒరిజినల్ ధృవీకరణ పత్రాలను మండల విద్యాశాఖాధికారి క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతోపాటు వారివద్ద నుండి బాండ్ పేపర్ మీద నియమావళి మేరకు అగ్రిమెంట్ వత్రాన్ని కూడా తీసుకొని వారికి కేటాయించిన పాఠశాలల ఉత్తర్వులను అందజేసారు.డి.ఎస్సీ 98ద్వారా ఎంపికైన సిరికి మహేష్ కు అనంతరాయుడుపేట, పెంట మోహనరావుకు వెంకటపురం(ఏ), రెడ్డి భాస్కరరావుకు నీలకంఠపురం, సిహెచ్ శ్రీనివాసరావుకు వెన్నెలబుచ్చెంపేట , ఎం.సత్యనారాయణకు వెంకటాపురం (ఎన్), ఆర్.అప్పలనాయుడుకు కాసాపేట, బలగ అప్పల నాయుడుకు చిన్నా రాయుడుపేట , టి.సూర్యప్రకాశరావుకు దయానిధిపురం పాటశాలలు కేటాయిస్తూ జిల్లా పరిషత్, జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో వారంతా గురువారం వారికి కేటాయించిన పాటశాలలో చేరినట్లు మండల విద్యాశాఖాధికారి చెప్పారు. ఇదిలా ఉండగా కొత్తగా చేరిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు ఏపీటిఎఫ్ నాయకులు మరడాన శివున్నాయుడు, దాసరి వెంకట నాయుడు, చుక్క శ్రీదేవి,సత్యనారాయణ పిఆర్టియునేత వోలేటి తవిటి నాయుడు తదితరులు అభినందించారు. సిఆర్పిలు అనసూయ, రమేష్లు, కార్యాలయ సిబ్బంది కూడా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నాటి అన్నా క్యాంటీన్ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమం

విశాలాంధ్ర - పార్వతీపురం: నాడు టీడీపీ ఆద్వర్యంలో పేదలకుఐదురూపాయలకే భోజనాన్ని సమకూర్చిన అన్నా కాంటీన్ తీసేసి నేడు వైఎస్సార్సీపీ పారిశుధ్య కార్యాలయం ఏర్పాటు చేయటమేనా అభివృద్ధా అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీద్వారపురెడ్డి జగదీశ్, టీడీపి నియోజక వర్గ ఇంచార్జి, మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఛాలెంజ్ చేశారు. గురువారం పట్టణంలోని నాటి అన్నా క్యాంటీన్ తీసి నేడు వైఎస్సార్సీపీ ఏర్పాటు చేసిన పురపాలక పారిశుధ్య కార్యాలయం వద్ద నియోజక వర్గ టీడీపీ నాయకులతో కలిసి సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం వారం ఒక్కో కార్యక్రమంపై టీడీపీ ఆద్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు.గత నాలుగేళ్లుగా ఎక్కడ అభివృధి జరిగిన సందర్భం లేదన్నారు.ఈకార్యక్రమంలో పార్వతీపురం పట్టణ, మండలఅధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహనరావు, పట్టణ అధ్యక్షుడు గుంట్రెడ్డి రవికుమార్, సీతానగరం మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి తిరుపతిరావు, పట్టణ కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, తాతపూడి వెంకటరావు, కోలా సరితమధుసూధనరావు, పార్టీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, గర్భాపు ఉదయభాను కోలాబాబు,బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గురువారం 150 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు సారథ్యంలో సచివాలయం పరిధిలోని కన్వీనర్ బుద్ధ కృష్ణ, గృహ సారదులు బుద్ధ గోవింద సుంకరి జగ్గారావు, క్లస్టర్ వాలంటీర్ గనివాడ శివ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్ధ అప్పలనాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొని గడప గడపలో సీఎం వైస్ జగన్ స్టిక్కర్లను అంటించారు.

దత్తిరాజేరు: మండల పరిధిలో గల పోరలి సచివాలయం సరయ్యవలస గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి రెండో రోజు కొనసాగింది. గ్రామంలో అపూర్వ ఆదరణ లభించింది. ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు. స్థానిక సర్పంచ్ సాలాపు లక్ష్మి, వైసిపి నాయకులు సాలాపు పాపారావు, సారికి రాము నాయుడు , పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని దాదాపు అన్ని గ్రామపంచాయతీలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం ఏడో రోజు నిర్వహించామని మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టి రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పోల ఈశ్వరనారాయణ, మాజీ సిడిసి ఛైర్మన్ నడిమింటి రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీలు అంబటి కృష్ణంనాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కొట్నానరత్నాకర్, మండల వైఎస్ఆర్సీపీ నేతలు ఆర్వీ పార్థసారథి, గాజాపు శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, బొన్నాడ శివ తదితర మండల నాయకులు తెలిపారు. పెదఅంకలం గ్రామంలో ఎంపిపి బలగ రవనమ్మ, లచ్చయ్యపేటలో జెడ్పీటీసీ బాబ్జి, కాసాపేటలో తెంటు వెంకట అప్పలనాయుడు, చినభోగిలి, బక్కుపేట, తామరకండి, గెడ్డలుప్పి, కోట సీతారాంపురం, గాదెలవలస, జానుమల్లు వలస, సుభద్ర సీతారాంపురం, పెదబోగిలి, అప్పయ్యపేట, బుడ్డిపేట, నిడగల్లు, ఇప్పలవలస, పాపమ్మవలస, కొత్తవలస, అంటిపేట, బూర్జ, కృష్ణరాయపురం, వనుకుపేట, దయానిధిపురం, లక్ష్మీపురం , బల్ల కృష్ణాపురం, బగ్గందొరవలస, మరిపి వలస, సూరమ్మపేట గుచ్చిమి, జోగమ్మపేట తదితర గ్రామాల్లో గురు వారంనాడు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంను నిర్వహించారు.

పాలకొండ: సీఎం జగన్ మీరే మా భవిష్యత్, నమ్మకం కార్యక్రమం గురువారం 15, 16 వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కౌన్సిలర్‌లు టి. అనూష, కె. అనురాధ, కౌన్సిలర్ ప్రతినిధి కె. వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ఆ వార్డు ప్రజలు విశేషంగా స్పందించారు. ప్రతీ అభివృద్ధి కార్యక్రమం మా ఇంటి వద్దకే వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పి. దవళేశ్వరరావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు వి. మన్మధరావు, పట్టణ కన్వీనర్ కె. విజయ్‌కుమార్, కౌన్సిలర్‌లు బాసూరు కాంతారావు, కె. మోహన్‌రావు, కె. గంగు నాయుడు, టి. లక్ష్మణరావు, కె. అరుణ్‌కుమార్, ఎం. అరుణ్‌కుమార్, వైసీపీ నాయకులు ఎం. చక్రవర్తి, టి. రామకృష్ణ, డా. చంద్రమౌళి, టి. వాసుదేవరావు, జగదీష్‌కుమార్, ఎస్. గణపతిరావు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గృహ సారధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్ళబురిడిలో ఇదేం ఖర్మ మన రాష్టానికి

విశాలాంధ్ర - పార్వతీపురం: మండలంలోని తాళ్ళబురిడి గ్రామపంచాయతీలో గురువారం సాయంత్రం ఇదేంఖర్మ -మన రాష్ట్రానికి కార్యక్రమంను టీడీపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్,టీడీపినియోజక వర్గఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు ఆద్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి గతమూడున్నర ఏళ్లలో వైఎస్సార్సీపీ అన్నివిధాలుగా వైపల్యం చెందిందని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం పట్టణ, మండలఅధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహనరావు,పార్టీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, గర్భాపు ఉదయభాను కోలాబాబు,బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కళాసీ మృతి

విశాలాంధ్ర-భామిని: రోజు వారీ దినసరి కూలీ,పనిచేస్తే తప్ప పూటగడవని ఆ కుటుంబానికి గుండె పోటు రూపంలో ఇంటి యజమానిని కోల్పోయింది. వివరాలోకి వెళ్తే మండల కేంద్రంలో ఎఫ్.సి. ఐ గోదాం లో కళాసీగా అనందు గౌడ్ (38) పని చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. రోజు వారీ లాగానే గురువారం గోదాం పనిచేస్తూ మధ్యాహ్నం భోజన సమయంలో అందరితో సరదాగా గడిపిన ఆయన అనంతరం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కళాసీలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడు కు భార్య భాను ,ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఈయూ నాయకులు బీకె మూర్తికి సన్మానం

విశాలాంధ్ర-పాలకొండ: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, విజయనగరం జిల్లా జోనల్ సెక్రటరీ బాసూరు కృష్ణమూర్తికి నర్సిపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ ఈయూ నాయకులు గురువారం నర్సీపట్నం డిపో ఆవణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం కార్మికుల శ్రేయస్సు కోసం యూనియన్‌లకు అతీతంగా విస్తృతంగా శ్రమిస్తున్నారని, కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి యూనియన్‌లకు అతీతంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులందరికీ బీకె మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే రాళ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో గురువారం జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్షా పథకంలో భాగంగా తెర్లాం మండలంలోని విజయరాంపురం(నియర్ కొరటాం) రెవెన్యూ గ్రామంలో జగనన్న భూ సర్వే రాళ్లను వివిధ పొలాల హద్దుల్లో పాటించారు. ఈ కార్యక్రమంలో కొరటాం సర్పంచ్ శ్రీకాంత్ ,గ్రామ రెవిన్యూ అధికారులు మరియు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.